సాక్షి
ములుగు
శుక్రవారం । 19 । ఏప్రిల్ । 2024



ప్రచార పర్మిషన్.. ఇక సులువు

గతంలో ఎన్నికల ప్రచారానికి అనుమతి కోసం తెల్ల కాగితాలపై రాసి కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వచ్చేది. ప్రస్తుతం 'సువిధ' యాప్‌ను ఎన్నికల సంఘం ప్రవేశపెట్టడంతో అనుమతులు సులువుగా లభిస్తున్నాయి. - 8లో



లక్షే లక్ష్యం..

టీఎస్ ఆర్టీసీ.. ఆదాయం పెంచుకునే దిశలో సరికొత్త చాలెంజ్‌లతో ముందుకెళ్తోంది. తాజాగా 'లక్షే లక్ష్యం' అనే పేరుతో మరో చాలెంజ్ తీసుకువచ్చింది. - 8లో

గరిష్ఠం/కనిష్ఠం 41.7°/28.6°

వాతావరణం

జిల్లాలో ఉదయం ఆహ్లాదకరమైన వాతావరణం ఉంటుంది. మధ్యాహ్నం తీవ్రమైన ఎండతో పాటు వడగాలులు వీస్తాయి. రాత్రి ఉక్కపోతగా ఉంటుంది.

న్యూస్‌రీల్

ఎన్‌హెచ్‌పై పోలీసుల తనిఖీ



గోవిందరావుపేట: మండల పరిధిలోని పస్రా పోలీస్‌స్టేషన్ పరిధిలో ఎస్సై కమలాకర్ ఆధ్వర్యంలో పస్రా ఎన్‌హెచ్‌పై గురువారం వాహనాల తనిఖీ చేపట్టారు. వచ్చి వెళ్లే ప్రతీ వాహనాన్ని ఆపి క్షుణ్ణంగా పరిశీలించడంతో పాటు వాహనదారుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎస్సై కమలాకర్ మాట్లాడుతూ ఎన్నికల నేపథ్యంలో డబ్బు, మద్యం సరఫరాను అడ్డుకోవటానికి పకడ్బందీగా చర్యలు చేపడుతున్నట్లు వివరించారు.

ఇద్దరి రిమాండ్



వాజేడు: విద్యుత్ తీగలు అమర్చి ఒకరి ప్రాణం పోవడానికి కారణమైన ఇద్దరిని రిమాండ్ చేసినట్లు వెంకటాపురం(కె) సీఐ బండారి కుమార్, వాజేడు ఎస్సై వెంకటేశ్వరరావు తెలిపారు. ఈ సందర్భంగా వారు గురువారం కేసు వివరాలను వెల్లడించారు. మండల పరిధిలోని చింతూరు గ్రామానికి చెందిన కన్నెబోయిన సమ్మయ్య పూజారి సురేష్‌తో కలిసి తన మొక్కజొన్న పంటను రక్షించుకోవడానికి మార్చి 27న విద్యుత్ తీగలను అమర్చాడు. రాత్రి సమయంలో అటుగా మంచినీళ్ల కోసం వెళ్లిన అభినయ్ విద్యుత్ తీగలు తగిలి గాయపడ్డాడు. అనంతరం చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతి చెందాడు. అందుకు కారణమైన కన్నెబోయిన సమ్మయ్య, పూజారి సురేష్‌లను అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపించినట్లు తెలిపారు. రైతులు, వేటగాళ్లు విద్యుత్ తీగలు అమర్చితే చట్ట ప్రకారం కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలి



వెంకటాపురం(కె): విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలని ఐటీడీఏ డిప్యూటీ డైరెక్టర్ పోచం అన్నారు. మండల పరిధిలోని ఆలుబాక, వెంకటా పురం ఎస్టీ బాలుర వసతి గృహాలను, చిరుతపల్లి బాలికల ఆశ్రమ పాఠశాలను ఆయన గురువారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన వసతి గృహాల్లో ఉన్న బాత్ రూమ్‌లు, తాగునీటి సౌకర్యం తదితర అంశాలను పరిశీలించారు. అనంతరం విద్యార్థుల హాజరు పట్టిక, రికార్డులను తనిఖీ చేశారు. స్టోర్ రూమ్‌లో ఉన్న స్టాక్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వసతి గృహాల్లో మరమ్మతులకు గురైన బాత్ రూమ్‌లు, విద్యుత్ మరమ్మతులు పనులు చేయించాలన్నారు.

ఆరోగ్యంపై అవగాహన కల్పించడం కోసమే..

- కాంగ్రెస్ నాయకుడు గుడాల శ్రీనివాస్

కాటారం (మహదేవపూర్): ప్రతీ ఒక్కరు సంపూర్ణ ఆరోగ్యవంతులుగా ఉండాలనే ఉద్దేశ్యంతో కొంత కాలంగా వ్యాయామం, యోగాపై తన వంతు బాధ్యతగా అవగాహన కల్పిస్తున్నానని.. అందులో భాగంగానే పోలీసులకు సైతం అవగాహన కల్పించే ప్రయత్నం చేసినట్లు మహదేవపూర్ కాంగ్రెస్ నాయకుడు, జెడ్పీటీసీ గుడాల అరుణ భర్త గుడాల శ్రీనివాస్ తెలిపారు. ఈ నెల 15న మహదేవపూర్ పోలీస్‌స్టేషన్‌లో శ్రీనివాస్ నృత్యం చేసిన ఘటన వైరల్ కాగా అదేరోజు కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు ఐత ప్రకాశ్‌రెడ్డి క్రమశిక్షణ చర్యల్లో భాగంగా షోకాజ్ నోటీస్ జారీ చేశారు. దీనిపై గురువారం గుడాల శ్రీనివాస్ సోషల్ మీడియా వేదికగా సంజాయిషీ ఇచ్చారు. 30 సంవత్సరాలుగా ప్రజాక్షేత్రంలో ఉంటూ మంచి విషయాలను ఎప్పటికప్పుడు ప్రజలకు తెలియజేస్తున్నానన్నారు. కరోనా బాధితులు గుండుపోటుతో మృతిచెందడం తనను బాధించిందని తెలిపారు. ఆరోగ్య పరిరక్షణ విషయంలో ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలని నిపుణులను అడిగి పలు సలహాలు తీసుకున్నానని చెప్పారు. ఆ విషయాలను నలుగురికి చెపుతూ వస్తున్నట్లు పేర్కొన్నారు. ఇదే క్రమంలో ఈ నెల 15న ఉదయం వాకింగ్‌కు వెళ్లి వస్తూ ఇంటి సమీపంలో ఉన్న పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి పోలీసులు పని ఒత్తిడి లేకుండా ప్రశాంతంగా ఉండాలని చెప్పే ప్రయత్నం చేసినట్లు వివరించారు. గిట్టని వారు కొందరు దురుద్దేశంతో అబద్ధపు మాటలు ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు. తన సంజాయిషీతో సంతృప్తి చెందకపోతే పార్టీ జిల్లా బాధ్యులు తీసుకోబోయే చర్యలను గౌరవిస్తానని పేర్కొన్నారు.

ఎన్నికల సందడి

- లోక్‌సభ ఎన్నికల నోటిఫికేషన్‌తో నామినేషన్ల ప్రక్రియ షురూ..
- మానుకోటలో తొలిరోజు ఒక్క నామినేషన్ దాఖలు
- నేడు కాంగ్రెస్ అభ్యర్థి బలరాంనాయక్ నామినేషన్
- కలెక్టరేట్‌లో తగిన ఏర్పాట్లు చేసిన అధికారులు



సాక్షి, మహబూబాబాద్: పార్లమెంట్ ఎన్నికల సందడి మొదలైంది. గురువారం నోటిఫికేషన్‌తో పాటు నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ మొదలైంది. ఈ నెల 25వ తేదీ వరకు నామినేషన్ల ప్రక్రియ కొనసాగుతుంది. ఉదయం 11నుంచి సాయంత్రం 3గంటల వరకు మహబూబాబాద్ పార్లమెంట్ నియోజకవర్గంలోని అభ్యర్థుల నుంచి మహబూబాబాద్ కలెక్టరేట్‌లో నామినేషన్లు స్వీకరిస్తారు. కాగా మొదటి రోజు గురువారం ఒక్క నామినేషన్ దాఖలైనట్లు అధికారులు తెలిపారు. ఇదిలా ఉండగా హెల్ప్‌డెస్క్ ఏర్పాటు చేసి ప్రీవెరిఫికేషన్ మొదలైన సేవలు అందుబాటులోకి తీసుకొచ్చారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా కలెక్టరేట్ వద్ద ప్రత్యేక నిఘా, రక్షణ బృందాలను ఏర్పాటు చేశారు. వీడియో, ఫొటోగ్రఫీతోపాటు రిటర్నింగ్ అధికారి చాంబర్‌లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు.

ముహూర్తం చూసుకుంటున్న అభ్యర్థులు..

పార్లమెంట్ ఎన్నికల్లో పోటీచేసే అభ్యర్థులు ముహూర్తాలు చూసుకుంటున్నారు. ఈమేరకు తెలిసిన పండితులతో తమ పేరు బలం, ముహూర్తం చూపించుకుంటున్నారు. ముఖ్యంగా కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ అభ్యర్థులు బలరాంనాయక్, మాలోత్ కవిత, అజ్మీరా సీతారాంనాయక్‌ల తోపాటు ఇతర పార్టీల అభ్యర్థులు తమకు అనుకూలమైన తేదీల్లో నామినేషన్లు వేసేందుకు సిద్ధం అవుతున్నారు. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి బలరాంనాయక్ నామినేషన్ హంగామాతో వేసేలా ఆపార్టీ నాయకులు వేం నరేందర్‌రెడ్డి, పార్లమెంట్ ఇన్‌చార్జ్ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు ప్రయత్నాలు చేస్తున్నారు. దీనిలో భాగంగా శుక్రవారం ఉదయం 11:30గంటలకు బలరాంనాయక్ నామినేషన్ వేసేందుకు సర్వం సిద్ధం చేశారు. నామినేషన్ వేసిన తర్వాత సాయంత్రం 5గంటలకు భారీ బహిరంగ సభకు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఈసభకు సీఎం రేవంత్‌రెడ్డి హాజరు కానున్నారు. అదేవిధంగా బీఆర్ఎస్ అభ్యర్థి కవిత, బీజేపీ అభ్యర్థి సీతారాంనాయక్ కూడా తమదైన శైలిలో నామినేషన్ వేయనున్నారని ఆయా పార్టీల నాయకులు చెబుతున్నారు.

ఎన్నికల ప్రక్రియ ఇలా..

నామినేషన్ల స్వీకరణ: ఏప్రిల్ 18 నుంచి 25వ తేదీ వరకు ..(ఆదివారం మినహా అన్ని పనిదినాల్లో ఉదయం 11నుంచి సాయంత్రం 3 గంటల వరకు)

స్క్రూట్నీ: ఏప్రిల్ 26న

నామినేషన్ల ఉపసంహరణ: ఏప్రిల్ 29వ తేదీ సాయంత్రం 3 గంటల వరకు

పోలింగ్ : మే 13న మహబూబాబాద్, డోర్నకల్, నర్సంపేట అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఉదయం 7నుంచి సాయంత్రం 5గంటల వరకు పోలింగ్ జరుగుతుంది. అలాగే ములుగు, పినపాక, ఇల్లెందు , భద్రాచలం నియోజకవర్గాల్లో ఉదయం 7నుంచి సాయంత్రం 4గంటల వరకే పోలింగ్ జరగనుంది.

ఓట్ల లెక్కింపు: జూన్ 4వ తేదీన

అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా ఓటర్లు

నియోజకవర్గం	పురుషులు	మహిళలు	ఇతరులు	మొత్తం
డోర్నకల్	1,09,150	1,13,455	07	2,22,612
మహబూబాబాద్	1,26,611	1,31,794	46	2,58,451
నర్సంపేట	1,15,068	1,20,370	09	2,35,447
ములుగు	1,13,592	1,19,172	27	2,32,791
పినపాక	99,824	1,03,798	05	2,03,627
ఇల్లెందు	1,09,812	1,15,094	04	2,24,910
భద్రాచలం	72,925	79,597	07	1,52,529
మొత్తం	7,46,982	7,83,280	105	15,30,367

సింగిల్ నామినేషన్..



మహబూబాబాద్: మానుకోట పార్లమెంట్ నియోజకవర్గ నామినేషన్ల స్వీకరణ కోసం స్థానిక కలెక్టరేట్‌లో రిటర్నింగ్ అధికారి కార్యాలయం ఏర్పాటు చేశారు. తొలిరోజు గురువారం ఒక్క నామినేషన్ దాఖలు అయినట్లు అధికారులు తెలిపారు. పార్లమెంట్ పరిధిలోని మరిపెడ మండలం ఎడ్జెర్ల గ్రామ శివారు గుర్రపు తండాకు చెందిన బానోత్ లింగ్యా నాయక్ నామినేషన్ పత్రాలను జిల్లా కలెక్టర్, రిటర్నింగ్ అధికారి అద్వైత్‌కుమార్ సింగ్‌కు అందజేశారు. ఆ పత్రాలను అధికారులు క్షుణ్ణంగా పరిశీలించారు. కలెక్టరేట్ ఎదుట భారీ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. ఆర్వో కార్యాలయంలోకి అభ్యర్థితో పాటు నలుగురిని అనుమతించారు. కార్యక్రమంలో సహాయ రిటర్నింగ్ అధికారులు, అదనపు కలెక్టర్లు లెనిన్ వత్సల్ టొప్పో, డేవిడ్, ఆర్డీఓలు అలివేలు, నర్సింహారావు, తహసీల్దార్లు భగవాన్‌రెడ్డి, దామోదర్, శ్వేత, ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ పవన్‌కుమార్ పాల్గొన్నారు.

సాక్షి తెలంగాణ ఎలక్షన్ 2024

నేడు సీఎం రేవంత్‌రెడ్డి రాక



ఏర్పాట్లను పరిశీలిస్తున్న మంత్రి తుమ్మల, ఎమ్మెల్యే మురళీనాయక్, అభ్యర్థి బలరాంనాయక్



ముస్తాబవుతున్న సభా వేదిక

- ఎన్నికల బహిరంగ సభలో ప్రసంగం
- భారీ జనసమీకరణకు కసరత్తు
- హెలిపాడ్‌ను పరిశీలించిన మంత్రి తుమ్మల

సాక్షి, మహబూబాబాద్: రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి శుక్రవారం మనుకోటకు రానున్నారు. సీఎంగా బాధ్యతలు చేపట్టిన తర్వాత తొలిసారి ఆయన పార్లమెంట్ ఎన్నికల ప్రచార నిమిత్తం జిల్లాకు వస్తున్నారు. కాగా మహబూబాబాద్ పార్లమెంట్ పరిధిలోని ఏడుగురు కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, ఇన్‌చార్జ్ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావుతో కలిసి ఎంపీ అభ్యర్థి బలరాంనాయక్ ఉదయం నామినేషన్ వేస్తారు. సాయంత్రం 4గంటలకు మహబూబాబాద్ పట్టణంలోని ఎన్టీఆర్ స్టేడియంలో జరిగే భారీ బహిరంగ సభకు సీఎం హాజరై ప్రసంగిస్తారు. 6గంటలకు హెలికాప్టర్ ద్వారా హైదరాబాద్‌కు వెళ్తారు. కాగా మూడు రోజులుగా సభ ఏర్పాట్లను సీఎం సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు పరిశీలించారు. గురువారం మంత్రి తుమ్మల జిల్లా పోలీస్ అధికారులతో కలిసి సభా వేదిక, హెలిపాడ్‌ను పరిశీలించారు.

సవాల్‌గా జనసమీకరణ..

ప్రస్తుతం ఎండలు దంచికొడుతున్నాయి. ఈ క్రమంలో బహిరంగ సభకు జనసమీకరణ సవాల్‌గా మారింది. అయితే కాంగ్రెస్ శ్రేణులు మాత్రం భారీ ఎత్తున జనాన్ని సమీకరించే పనిలో నిమగ్నమయ్యారు. మహబూబాబాద్, డోర్నకల్, నర్సంపేట, ఇల్లెందు నియోజకవర్గాల నుంచి జనాలను తరలించే బాధ్యత ఆయా ప్రాంతాల ఎమ్మెల్యేలు, ముఖ్య నాయకులకు అప్పగించారు. లక్ష మందిని తరలించాలని సీఎం సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు నాయకులు, ప్రజాప్రతినిధులకు టార్గెట్ పెట్టారు. అయితే గతంలో మాదిరిగా ప్రజలు స్వచ్ఛందంగా సభలకు వచ్చే పరిస్థితి లేదని పలువురు నాయకులు చెప్పారు. దీనిని దృష్టిలో ఉంచుకొని జనాన్ని తరలించడం, వారికి తాగునీరు, మజ్జిగ, పెరుగన్నం మొదలైనవి సమకూర్చుకొనిసభకు రావాల్సి ఉంటుంది. అయితే 'అసెంబ్లీ ఎన్నికల్లో అప్పులు తెచ్చి ఖర్చుపెట్టాం .. ఇప్పుడు బలరాంనాయక్ ఎన్నిక మా చావుకు వచ్చింది.. పార్టీ ఆదేశాలు కఠినంగా ఉన్నా యి.. ఆర్థిక వనరులు మాత్రం లేవు అని' ఓ ప్రజాప్రతినిధి తమ అనుచరులతో వాపోయినట్లు ప్రచారం.

ఉదయం నామినేషన్.. సాయంత్రం సభ..

కాంగ్రెస్ అభ్యర్థి పోరిక బలరాంనాయక్ నామినేషన్ ప్రక్రియ శుక్రవారం ఉదయం జరిపేందుకు కాంగ్రెస్ పార్టీ నాయకులు సిద్ధమయ్యారు. పార్లమెంట్ పరిధిలోని ఏడుగురు ఎమ్మెల్యేలతోపాటు, ప్రతి మండలం నుంచి కీలక నాయకులు హాజరు కావాలని ముఖ్యనేతలు పిలుపునిచ్చారు. అయితే సాయంత్రం సీఎం సభకు జనసమీకరణ బాధ్యత ఉండటంతో ఉదయం వచ్చి మహబూబాబాద్‌లోనే ఉంటే జనాన్ని తరలించడం ఇబ్బందిగా ఉంటుందని, సాయంత్రం నేరుగా జనంతో సభకే వస్తామని పలువురు నాయకులు అంటున్నారు.

బందోబస్తు ఏర్పాట్ల పరిశీలన.

మహబూబాబాద్ రూరల్: ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పర్యటనలో భాగంగా జిల్లా కేంద్రంలోని సభాస్థలి, హెలిపాడ్, పోలీస్ బందోబస్తు ఏర్పాట్లను ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్ గురువారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. మహబూబాబాద్ జిల్లాతోపాటుగా జయశంకర్ భూపాలపల్లి, ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల నుంచి పోలీసు అధికారులు, సిబ్బంది బందోబస్తు విధులు నిర్వహించనున్నారు. ఐఎస్‌డబ్ల్యూ అధికారి వాసుదేవ రెడ్డి, ఇంటెలిజెన్స్ ఎస్పీ భాస్కర్, డీఎస్పీ జితేందర్ రెడ్డి ప్రత్యేకంగా వచ్చి సభాస్థలి, హెలిపాడ్ ప్రాంతాలను ఎస్పీతో కలిసి పరిశీలించారు. ట్రైనీ ఐపీఎస్ చేతన్ పండరీ, అడిషనల్ ఎస్పీ చెన్నయ్య, డీఎస్పీ తిరుపతిరావు, టౌన్ సీఐ దేవేందర్ ఉన్నారు.

ఖర్చులు పారదర్శకంగా చూపించాలి

ఎన్నికల వ్యయ పరిశీలకులు రామ్‌కుమార్ గోపాల్



కలెక్టర్, ఇతర అధికారులతో ఎన్నికల అంశాలపై చర్చిస్తున్న రామ్‌కుమార్ గోపాల్

ములుగు: లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు నామినేషన్ సమర్పించే సమయంలో ఖర్చులను పారదర్శకంగా చూపించాలని ఎన్నికల వ్యయ పరిశీలకులు రామ్‌కుమార్ గోపాల్ అన్నారు. మహబూబాబాద్ పార్లమెంటరీ పరిధిలోని అభ్యర్థులు ములుగు అసెంబ్లీ నియోజకవర్గం సెగ్మెంట్ ఎన్నికల ప్రచార ఖర్చులు పరిశీలించేందుకు ఎన్నికల కమిషన్ కేటాయించిన ఎన్నికల వ్యయ పరిశీలకులు రామ్‌కుమార్ గోపాల్ జిల్లాకు గురువారం చేరుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టరేట్‌లో కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ఇలా త్రిపాఠి చాంబర్‌లో ఎస్పీ శబరీశ్, ఐటీడీఏ పీఓ, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి చిత్రామిశ్రా, అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు), అదనపు అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి పి.శ్రీజలతో రామ్‌కుమార్‌గోపాల్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా జిల్లాలో ఎన్నికల ఖర్చుల నమోదుకు ఏర్పాటు చేసిన ఫ్లయింగ్ స్క్వాడ్, స్టాటిక్, వీడియో సర్వేలెన్సు, వీడియో వ్యూయింగ్ బృందాలు, వాటి పనితీరు తదితర అంశాలను కలెక్టర్, ఎస్పీ ఎన్నికల పరిశీలకులకు వివరించారు. అనంతరం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో ఎన్నికలలో వ్యయ లెక్కింపునకు ఏర్పాటు చేసిన కమిటీలు, బృందాలు ఇప్పటి వరకు స్వాధీనం చేసుకున్న, అప్పగించిన నగదు, మద్యం తదితర వివరాలను ఎస్ఎస్‌టీ, ఎఫ్ఎస్‌టీ బృందాలతో వ్యయ పరిశీలకులు సమీక్షించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్(రెవెన్యూ), డిప్యూటీ ఎలక్షన్ ఆఫీసర్ మహేందర్‌జీ, ఆర్డీఓ, ఈఆర్‌ఓ సత్యపాల్‌రెడ్డి, జిల్లా వ్యయ పర్యవేక్షణ కమిటీ నోడల్ అధికారి సర్దార్ సింగ్, ఎక్సైజ్ అధికారులు లింగాచారి, సహాయ వ్యయ పర్యవేక్షకులు, అకౌంట్ అధికారులు పాల్గొన్నారు.

ఫైర్ సిబ్బంది సేవలను సద్వినియోగం చేసుకోవాలి



వారోత్సవాల పోస్టర్లు ఆవిష్కరిస్తున్న ఫైర్ సిబ్బంది

ములుగు రూరల్: అగ్నిమాపక సిబ్బంది సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఫైర్ ఆఫీసర్ ఎండీ.అబ్దుల్ రహీం అన్నారు. అగ్నిమాపక వారోత్సావాల్లో భాగంగా గురువారం ములుగు పట్టణ కేంద్రంలోని లక్ష్మీ గ్యాస్ ఏజెన్సీస్‌లో వంట గ్యాస్ ద్వారా అగ్ని ప్రమాదం సంభవించినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పోస్టర్లను ఆవిష్కరించారు. అనంతరం అవగాహన కల్పించి మాక్ డ్రిల్ నిర్వహించారు. ఈ సందర్భంగా అబ్దుల్ రహీం మాట్లాడుతూ ఎక్కడైనా అగ్ని ప్రమాదం సంభవించినప్పుడు ములుగు అగ్నిమాపక కేంద్రం సెల్ నంబర్ 8712699210, 8712699211 లేదా 101కి సమాచారం అందించాలన్నారు. అగ్ని ప్రమాదంలో ఎటువంటి వస్తువులు కాలుతున్నాయో స్పష్టంగా తెలుపాలన్నారు. అగ్ని ప్రమాదం సంభవించినప్పుడు కంగారు పడకుండా అగ్ని ప్రమాదాన్ని నివారించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎల్ఎఫ్ మహేశ్వర్, డీఓపీ రమేష్, సురేందర్, ధన్ సింగ్, చంద్రప్రకాశ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మోడికుంటను నిర్లక్ష్యం చేస్తున్న పాలకులు



మాట్లాడుతున్న రవికుమార్

వాజేడు: మోడికుంట ప్రాజెక్టును పాలకులు నిర్లక్ష్యం చేస్తున్నారని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యులు బండారు రవికుమార్ అన్నారు. మండల పరిధిలోని పూసూరు రిసార్ట్స్‌లో పార్టీ నాయకులు దావూద్ అధ్యక్షతన జిల్లా కమిటీ సమావేశాన్ని గురువారం ఏర్పాటు చేశారు. ఈ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. వాజేడు మండల పరిధిలోని కృష్ణాపురం సమీపంలో మంజూరైన మోడికుంట ప్రాజెక్టును పూర్తి చేస్తే సాగు, తాగు నీరు అందుతుందన్నారు. వ్యవసాయ రంగం అభివృద్ధి చెందాలంటే సాగునీరు కీలకమన్నారు. 2006 నుంచి మోడికుంట ప్రాజెక్టు కోసం ఎదురుచూస్తున్న రైతులకు ఆనాటి కాంగ్రెస్ ప్రభుత్వం నిధులను మంజూరు చేయించి అనుమతులు లేవని కాలయాపన చేసిందని ఆరోపించారు. 2016లో అనుమతులు వచ్చినప్పటికీ ప్రజల అభిప్రాయ సేకరణ చేసి ఇప్పటి వరకు దాని ఊసే ఎత్తలేదన్నారు. ప్రాజెక్టు పూర్తి చేస్తే 36 గ్రామాలకు తాగునీరు, 25 వేల ఎకరాలకు సాగునీరు అందే అవకాశం ఉందన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి నిధులు మంజూరు చేసి ప్రాజెక్టును పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులు సూడి కృష్ణారెడ్డి, జిల్లా కార్యదర్శి తుమ్మల వెంకటరెడ్డి, మండల కార్యదర్శి కొప్పుల రఘుపతి రావు, బీరెడ్డి సాంబశివ, రత్నం రాజేందర్, వాసు, చిట్టిబాబు, శ్రీను, రాములు, ఆగిరెడ్డి, రాజేష్, చిరంజీవి, చిన్నా పాల్గొన్నారు.

ఉపాధి@ఎన్‌ఎల్‌ఎం

గొర్రెలు, కోళ్లు, పందుల పెంపకానికి కేంద్రం ప్రోత్సాహం

- పెంపకం దారులకు 50శాతం సబ్సిడీ
- యూనిట్ విలువ రూ.10లక్షల నుంచి రూ.కోటి వరకు





ములుగు రూరల్: ఉపాధి, ఉత్పాదకతే లక్ష్యంగా జీవాల పెంపకందారులకు చేయూతనివ్వాలనే లక్ష్యంతో సబ్సిడీ రుణాలను అందించేందుకు కేంద్ర ప్రభుత్వం ముందుకు వచ్చింది. నేషనల్ లైవ్ స్టాక్ మిషన్ పథకం(ఎన్ఎల్ఎం)పేరుతో పెంపకందారులకు 50శాతం సబ్సిడీ అందించి జీవాల పెంపకానికి ప్రోత్సాహం అందిస్తోంది. ఎన్ఎల్ఎం పథకం ద్వారా గొర్రెలు, కోళ్లు, పందుల పెంపకంతో పాటు దానా ప్రాసెసింగ్ యూనిట్లకు రుణాలు మంజూరు చేసేందుకు ప్రణాళిక సిద్ధం చేసింది. ఒక్కో యూనిట్ విలువ రూ.10 లక్షల నుంచి కోటి రూపాయల వరకు అందించాలని నిర్ణయించింది. గొల్ల కురుమలకు కాకుండా అన్ని సామాజిక వర్గాల ప్రజలను అర్హులుగా గుర్తించింది. దీంతో పాటు పరపతి సంఘాలు, సొసైటీలకు రుణాలను మంజూరు చేయనుంది. పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో ఈ పథకం అమలుకు శ్రీకారం చుట్టింది.

యూనిట్ ఐదు విభాగాలుగా విభజన

నేషనల్ లైవ్ స్టాక్ మిషన్ పథకంలో కేంద్ర ప్రభుత్వం పలు మార్పులు తీసుకొచ్చింది. పథకం ప్రారంభంలో కేవలం యూనిట్ విలువ రూ.కోటి కేటాయించింది. బ్యాంకు రుణం రూ.40 లక్షలు, లబ్ధిదారుడి వాటా ధనం రూ.10 లక్షలు, ప్రభుత్వ సబ్సిడీ రూ.50 లక్షలుగా నిర్ణయించింది. యూనిట్ విలువలో బ్యాంకు రుణాలకు బ్యాంకర్లు నిరాకరించడంతో యూనిట్ విలువను తగ్గించింది. దీంతో యూనిట్ విలువను ఐదు విభాగాలుగా విభజించి రుణాలు అందజేయాలని సడలించింది. దీంతో 105 గొర్ల నుంచి 525 గొర్రెల వరకు రూ.10 లక్షల నుంచి కోటి వరకు రుణాలు ఇస్తుంది.

ఆన్‌లైన్ దరఖాస్తు చేసుకునే విధానం

లబ్ధిదారుడు ఎంపిక చేసుకున్న యూనిట్‌ను బట్టి రెండు ఎకరాల భూమి నుంచి 10ఎకరాల భూమి అవసరం ఉంటుంది. భూమిలేని లబ్ధిదారులు లీజుకు తీసుకొని రుణాలు పొందవచ్చు. లబ్ధిదారుడు యూనిట్ పెంచుకునే స్థలంలో పశుగ్రాసం పెంచి బ్యాంక్ కాన్‌సెంట్ తీసుకురావాలి. లబ్ధిదారుడు ఒరిజినల్ డాక్యుమెంట్లు జత చేస్తూ ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తు కాపీలను జిల్లా పశు సంవర్ధక శాఖ కార్యాలయంలో అందజేయాల్సి ఉంటుంది. చివరి తేదీ లేకుండా లబ్ధిదారుడు ఎప్పుడైన దరఖాస్తు చేసుకునే విధంగా కేంద్ర ప్రభుత్వం వెసులుబాటు కల్పించింది.

ఎంపిక విధానం

ఎన్ఎల్ఎం పథకంలో ఆన్‌లైన్ దరఖాస్తులు చేసుకున్న వారి ఎంపిక కోసం రాష్ట్ర, కేంద్ర స్థాయిలో రెండు కమిటీలు ఉంటాయి. ఆన్‌లైన్‌లో వచ్చిన దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి లబ్ధిదారులను ఎంపిక చేస్తారు. లబ్ధిదారుడికి బ్యాంకు రుణం మంజూరైన తర్వాత 25 శాతం, యూనిట్ గ్రౌండింగ్ తర్వాత 25 శాతం సబ్సిడీ నిధులను బ్యాంకు ఖాతాలో జమ చేస్తారు. బ్యాంకు రుణం అవసరం లేని వారు సొంతంగా పెట్టుబడి పెట్టి షెడ్‌లు, పశుగ్రాసం పెంపకం చేపట్టిన అనంతరం సబ్సిడీని పొందవచ్చు.

సద్వినియోగం చేసుకోవాలి..



కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న నేషనల్ లైవ్ స్టాక్ మిషన్ పథకాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలి. యూనిట్ విలువలో 50 శాతం సబ్సిడీ ఇస్తుంది. పథకం పూర్తి స్థాయి సబ్సిడీ డబ్బులు రెండు సంవత్సరాల కాల పరిమితిలో చెల్లించబడుతాయి. ఆసక్తి కలిగిన రైతులు దరఖాస్తులు చేసుకోవాలి.

- రవికుమార్, జిల్లా పశు సంవర్ధకశాఖ అధికారి

గని కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

భూపాలపల్లి అర్బన్: భూపాలపల్లి ఏరియాలోని వివిధ గనుల్లో కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని తెలంగాణ సింగరేణి ఉద్యోగుల సంఘం ఏరియా ఉపాధ్యక్షుడు దాసరి జనార్ధన్ డిమాండ్ చేశారు. ఏరియాలోని యూనియన్ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. 5వ గనిలో మ్యాన్‌రైడింగ్ సరిగా పని చేయడం లేదన్నారు. 150 కుర్చీలు ఉండాల్సి ఉండగా.. కేవలం 20 కుర్చీలు మాత్రమే ఉన్నాయని తెలిపారు. క్యాంటీన్‌లో సమయపాలన పాటించడం లేదని చెప్పారు. అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదన్నారు. ఎండ తీవ్రత పెరిగినప్పటికీ చల్లటి తాగునీటికి అందించడం లేదని ఆరోపించారు. ప్రశ్నించిన కార్మికులను సస్పెండ్ చేస్తూ చార్జిషీట్లు జారీ చేస్తున్నారని మండిపడ్డారు. ఈ సమావేశంలో నాయకులు కాసర్ల ప్రసాద్‌రెడ్డి, శ్రీనివాస్, కలికోటి లింగయ్య, రాళ్లబండి బాబు, శ్రీధర్ పాల్గొన్నారు.

రామాలయంలో నిత్యారాధన హోమం



రామాలయంలో హోమం నిర్వహిస్తున్న వేద పండితులు

ఏటూరునాగారం: మండల కేంద్రంలోని శ్రీసీతారామచంద్రస్వామి ఆలయంలో గురువారం ఉదయం నిత్యారాధన, హోమం, బలిహరణ కార్యక్రమాన్ని వేదపండితులు ముక్కాముల వెంకటనారాయణశర్మ, యల్లాప్రగడ మణికంటిశర్మ, నాగేశ్వర్‌రావుశర్మ ఘనంగా నిర్వహించారు. సాయంత్రం సదస్యము, ఆరగింపు, పల్లకిసేవ కార్యక్రమాలు జరిపించారు. అనంతరం సీతారాములను దర్శించుకున్న భక్తులకు తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు. రామాలయంలో ఐదు రోజుల బ్రహ్మోత్సవాలలో భాగంగా నాలుగో రోజు (శుక్రవారం) ఆలయంలో రాత్రి 9గంటలకు పుష్పయాగం(నాగబెల్లి) కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు అర్చకులు నాగేశ్వర్‌రావుశర్మ తెలిపారు.

ప్రచార పర్మిషన్.. ఇక సులువు

'సువిధ' యాప్‌తో సులభం..
- 48 గంటల్లోనే అనుమతులు
- గతంలో కార్యాలయాల చుట్టూ తిరిగే పరిస్థితి..
- నేడు అంతా ఆన్‌లైన్‌లోనే..



ఖిలా వరంగల్: గతంలో ఎన్నికల ప్రచారానికి సంబంధించి ఓ సమావేశం నిర్వహించాలంటే అనుమతి కోసం తెల్ల కాగితాలపై రాసి కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వచ్చేది. అధికారులకు సమయం దొరికినప్పుడు అనుమతులిచ్చేవారు. ఈ విధానం నాయకులకు తలనొప్పిగా ఉండేది. ప్రస్తుతం అనుమతులు సులువుగా లభిస్తున్నాయి. దీనికి కారణం ఓ యాప్. ఎన్నికల సంఘం'సువిధ' అనే పేరుతో యాప్ ప్రవేశపెట్టింది. దీని వల్ల సమావేశాల అనుమతుల జారీకి అధికారుల వద్దకు వెళ్లాల్సిన పనిలేదు. యాప్‌లో దరఖాస్తు చేసుకుంటే చాలు.. అనుమతులు జారీ చేస్తారు. వరంగల్ పార్లమెంట్ ఎన్నికలకు సంబంధించి గురువారం నామినేషన పత్రాల స్వీకరణ కార్యక్రమం ప్రారంభమైంది. నామిషనేషన్ల ఘట్టం పూర్తికాగానే ప్రచారం జోరుగా సాగనుంది. ప్రధాన పార్టీలు సభలు, సమావేశాలపై దృష్టి సారించనున్నాయి. ఒకరిపై ఒకరు విమర్శలు గుప్పించుకుంటారు. ర్యాలీలతో హోరెత్తిస్తారు. అయితే అభ్యర్థులు ఎలాంటి కార్యకలాపాలు నిర్వహించాలన్నా.. మందస్తు అనుమతులు పొందాల్సి ఉంటుంది. ఇందుకు 'సువిధ' యాప్‌లో దరఖాస్తు చేసుకోవాలి.

పార్లమెంట్ పరిధిలో కలెక్టర్..

వరంగల్ పార్లమెంట్ పరిధిలో 7 అసెంబ్లీ నియోజకవర్గాలున్నాయి. ఒక పార్టీకి చెందిన ప్రచార వాహనం పార్లమెంట్ పరిధిలోని అన్ని నియోజకవర్గాల్లో తిరగాల్సి వస్తే ఎన్నికల రిటర్నింగ్ అధికారిగా వ్యవహరించే కలెక్టర్ అనుమతిస్తారు. ప్రధాన నాయకులు హెలికాప్టర్లలో వస్తే దీని అనుమతి కలెక్టర్ వద్దే తీసుకోవాల్సి ఉంటుంది. ఇది కూడా 'సువిధ' ద్వారానే దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది.

అసెంబ్లీ పరిధిలో ఏఆర్వోలు ..

పార్లమెంట్ పరిధిలో అసెంబ్లీ నియోజకవర్గాల్లో ప్రచారానికి ఏఆర్వోలు అనుమతులు జారీ చేస్తారు. నియోజకవర్గ పరిధిలో వాహనాలు, ప్రజలతో కలిసి ర్యాలీలు, తాత్కాలిక ఎన్నికల కార్యాలయాల ఏర్పాటు, లోడ్ స్పీకర్లు , జెండాలు, పోస్టర్ల వినియోగం, ఇంటింటి ప్రచారం.. ఇలా ఏ కార్యక్రమానికైనా అనుమతి పొందాల్సిందే.

'సువిధ' యాప్‌లో ఇలా దరఖాస్తు చేసుకోవాలి..
- సెల్‌ఫోన్‌లో గూగుల్ ప్లే స్టోర్ ద్వారా 'సువిధ' యాప్ డౌన్ లోడ్ చేసుకోవాలి.
- సమావేశం నిర్వహించే వివరాలతో పాటు తమకు ఏ విధమైన అనుమతులు కావాలో అందులో నమోదు చేయాలి.
- అనుమతులకు సంబంధించి మీసేవ కేంద్రంలో చలాన్ చెల్లించాల్సి ఉంటుంది. చెల్లించిన చలాన్ రసీదు, 'సువిధ' యాప్‌లో నమోదు చేసిన వివరాలు రిటర్నింగ్ అధికారికి, అసెంబ్లీ పరిధిలోని ఏఆర్వో కార్యాలయాల్లో అందజేయాలి.
- ఎలాంటి జాప్యం లేకుండా దరఖాస్తులు ఎన్నికల అధికారులకు చేరిన 48 గంటల్లోనే అనుమతులు జారీ చేస్తారు.
- అనుమతి జారీలో జాప్యం జరిగితే సంబంధిత రిటర్నింగ్ అధికారికి దరఖాస్తు చేసుకోవచ్చు.



గస్తీ షురూ..!

కమిషనరేట్ పరిధిలో 23చెక్ పోస్టులు
- నిరంతరం ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాల తనిఖీలు
- రూ.49వేల వరకు అనుమతి
- చెక్‌పోస్టులను తనిఖీ చేస్తున్న సీపీ


పెంబర్తి చెక్‌పోస్టు వద్ద తనిఖీలు చేపడుతున్న పోలీసులు

వరంగల్ క్రైం: లోక్‌సభ ఎన్నికల వేడి మొదలైంది. దీంతో వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో గురువారం నుంచి తనిఖీలు మొదలయ్యాయి. ఇప్పటికే బెల్ట్ షాపులు నిర్వహించకుండా ఆయా పోలీస్ స్టేషన్‌ల పరిధిలో కఠిన చర్యలు చేపడుతున్నారు. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా బెల్ట్ షాపులు నిర్వహించినా.. సమయ పాలన తర్వాత మద్యం విక్రయించిన వారిపై కేసులు నమోదు చేసి తహసీల్దార్ల వద్ద బైండోవర్ చేస్తున్నారు. గతంలో కమిషనరేట్ పరిధిలో ఏర్పాటు చేసి.. ఎన్నికలకు ఎక్కువ సమయం ఉన్నందున ఎన్నికల కమిషన్ ఆదేశాలతో ఎత్తివేసిన చెక్‌పోస్టులను పోలీస్ అధికారులు తిరిగి గురువారం నుంచి ప్రారంభించారు. ప్రతి చెక్ పోస్టులో పకడ్బందీగా సీసీ కెమెరాలను ఏర్పాటు చేసి పోలీస్, రెవెన్యూ అధికారులు సంయుక్తంగా పర్యవేక్షిస్తున్నారు. చెక్‌పోస్టుల దగ్గర భారీగా పోలీస్ సిబ్బందిని మోహరించి ప్రతి వాహనాన్ని తనిఖీ చేస్తున్నారు. అనుమానాస్పందంగా కనిపించే వ్యక్తులను అదుపులోకి తీసుకుని విచారణ చేస్తున్నారు.

కమిషనరేట్‌లో చెక్‌పోస్టులు ఇవే..

వరంగల్ పోలీస్ కమిషనరేట్ వ్యాప్తంగా పోలీస్ అధికారులు 23 చెక్ పోస్టులు ఏర్పాటు చేశారు. వరంగల్ పార్లమెంట్ నియోజవర్గం పరిధిలోని అసెంబ్లీ నియోజవర్గాల పరిధిలో చెక్ పోస్టులు ఏర్పాటు చేశారు. ఈస్ట్‌జోన్ పరిధిలో నర్సంపేట నియోజకవర్గంలో అయ్యప్ప గుడి, నల్లబెల్లి మండలం బోల్లోనిపల్లి, ఖానాపూర్ మండలం అశోక్‌నగర్, వరంగల్ తూర్పు నియోజవర్గం పరిధిలో లేబర్ కాలనీ జాన్‌పాక పీరీలు, నాయుడు పెట్రోల్ పంపు, వర్ధన్నపేట నియోజవర్గంలో హసన్‌పర్తిలోని అనంతసాగర్, డీసీతండా, చింత నెక్కొండ, సెంట్రల్ జోన్ పరిధిలో.. వరంగల్ పశ్చిమ నియోజవర్గం పరిధిలో కాజీపేట డీజిల్ కాలనీ, ఐశ్వర్యగార్డెన్ ములుగురోడ్డు, సీఎస్ఆర్ గార్డెన్, పరకాల నియోజవర్గ పరిధిలో కటాక్షపూర్ క్రాస్, గీసుగొండ కొమ్మాల, నడికూడ, హుజూరాబాద్ నియోజవర్గంలో ఎల్కతుర్తి పెంచికలపేట, స్టేషన్‌ఘన్‌పూర్ పరిధిలో లింగాలఘణపురం జీడికల్, జఫర్‌గడ్ నల్లబండ, సాక్షి కార్యాలయం రాంపూర్, పాలకుర్తి నియోజవర్గంలో దేవరుప్పుల మండల కేంద్రం, రాయపర్తి కిష్టపూర్ క్రాస్, జనగామ నియోజవర్గం పరిధిలో.. జనగామ పెంబర్తి, బచ్చన్నపేట కొన్నె క్రాస్ వద్ద చెక్ పోస్టులు ఏర్పాటు చేశారు.

24 ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు..

23 చెక్ పోస్టులతోపాటు కమిషనట్ పరిధిలో 24 ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు ఏర్పాటు చేశారు. వీటితోపాటు మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ (ఎంసీసీ) బృందాలను 25 నియమించారు. ఇవి రెండు మండలాలకు ఒక బృందం చొప్పున పనిచేస్తాయి. ఒక్కో చెక్‌పోస్టులో 8మంది సీఆర్‌పీఎఫ్ కానిస్టేబుళ్లు, ఆరుగురు సివిల్ కానిస్టేబుళ్లు, ఇద్దరు రెవెన్యూ సిబ్బంది, ఒక రెవెన్యూ అధికారి.. ప్రతి చెక్‌పోస్టులో వీడియోగ్రాఫర్ ఉంటారు. సరైన పత్రాలు ఉంటే రూ.49,900వరకు వెంట తీసుకెళ్లేందుకు అనుమతిస్తారు. 7ఫుల్ బాటిల్స్, కాటన్ (12) బీర్ల వరకు అనుమతి ఉంటుంది. రాజకీయ పార్టీల ప్రచార వస్తువులు వెంట ఉంటే వారి దగ్గర రూ.10వేలు నగదు ఉన్న సీజ్ చేస్తారు. చెక్ పోస్టులతోపాటు ఎంసీసీ బృందాలు కూడా అడుగడుగునా తనిఖీలు చేపడుతాయి.

రూ.7.14 లక్షల నగదు పట్టివేత


రామన్నపేట: వాహనాన్ని తనిఖీ చేస్తున్న పోలీసులు

రామన్నపేట : లోక్‌సభ ఎన్నికల్లో భాగంగా పోలీసులు గురువారం పలుచోట్ల వాహన తనిఖీలు చేపట్టారు. ఇందులో ఆధారం లేకుండా తరలిస్తున్న నగదు మొత్తం 7.14 లక్షల నగదు పట్టుకున్నారు. వరంగల్ ఏసీపీ బి.నందిరాం ఆధ్వర్యంలో గురువారం నగరంలోని పోచమ్మమైదాన్ సెంటర్‌లో పోలీసులు వాహనాల తనిఖీ నిర్వహించారు. ఇందులో ఎలాంటి ఆధారాలు లేకుండా తరలిస్తున్న డబ్బులు స్వాధీనం చేసుకున్నారు. వరంగల్‌కు చెందిన బండారి మణికంఠ నుంచి రూ.2.80 లక్షలు, షేక్ జిజ్వాద్ వద్ద రూ.84 వేలు, నద్దునూరి రవి వద్ద రూ.63 వేలు, తుపాకుల శ్రీకాంత్ వద్ద రూ.56వేలు, సార భాస్కర్ వద్ద రూ.54వేలు.. మొత్తం రూ.4.65 లక్షలు స్వాధీనం చేసుకుని ఎలక్షన్ ఫ్లయింగ్ స్క్వాడ్ టీం ఇన్‌చార్జ్‌కు అప్పగించారు.

స్టేషన్‌ఘన్‌పూర్‌లో రూ.లక్ష..

స్టేషన్‌ఘన్‌పూర్: స్టేషన్‌ఘన్‌పూర్ రైల్వేస్టేషన్ వద్ద గురువారం నిర్వహించిన వాహన తనిఖీల్లో రూ.లక్ష నగదు పట్టుకున్నట్లు సీఐ ముస్క రాజు తెలిపారు. మండలంలోని మాన్‌సింగ్‌తండాకు చెందిన భూక్య రవీందర్ బైక్‌పై ఘన్‌పూర్ నుంచి మాన్‌సింగ్ తండాకు వెళ్తుండగా తనిఖీ చేసినట్లు పేర్కొన్నారు. అతడి వద్ద ఎలాంటి ఆధారాలు లేని రూ.లక్ష లభించడంతో స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

చిల్పూరులో రూ.1.49 లక్షలు..

చిల్పూరు: మండల పరిధి వెంకటాద్రిపేట-తరిగొప్పుల రోడ్డులో గురువారం రూ.1.49 లక్షల నగదును సీజ్ చేసినట్లు ఎస్సై ముత్యం రాజేందర్ తెలిపారు. వెంకటేశ్వరపల్లి వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా చిల్పూరు పంచాయతీ పరిధి వడ్డెగూడేనికి చెందిన కస్తూరి వెంకట్రాజం బైక్‌పై వెళ్తుండగా అనుమానం వచ్చి తనిఖీ చేసినట్లు చెప్పారు. ఆధారాలు లేని నగదు పట్టుకుని సీజ్ చేసినట్లు వివరించారు.

నామినేషన్ల ప్రక్రియ షురూ!

- వరంగల్ పార్లమెంట్ స్థానానికి మొదటి రోజు మూడు దాఖలు..


కలెక్టరేట్‌లోని ఆర్‌ఓ కార్యాలయంలో నామినేషన్లు దాఖలు చేస్తున్న బుద్దయ్య

కాళోజీ సెంటర్ : లోక్‌సభ ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ గురువారం ప్రారంభమైంది. వరంగల్ ఎస్సీ పార్లమెంట్ నియోజకవర్గానికి సంబంధించి మొదటి రోజు మూడు నామినేషన్లు దాఖలయ్యాయని రిటర్నింగ్ అధికారి, వరంగల్ కలెక్టర్ పి.ప్రావీణ్య తెలిపారు. అలయన్స్ ఆఫ్ డెమొక్రటిక్ రిఫార్మ్స్ పార్టీ (రిజిస్టర్డ్ పార్టీ) అభ్యర్థిగా అంబోజు బుద్దయ్య, ఇండిపెండెంట్(స్వతంత్ర)అభ్యర్థిగా బరిగెల శివ, పిరమిడ్ పార్టీ ఆఫ్ ఇండియా(రిజిస్టర్డ్ ఆన్ రికగ్నైజ్డ్) పార్టీ అభ్యర్థినిగా తౌటపల్లి నర్మదా ఒక్కో సెట్ చొప్పున నామినేషన్ వేశారని రిటర్నింగ్ అధికారి కలెక్టర్ పి.ప్రావీణ్య తెలిపారు.

బీఫాంలు అందుకున్న బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థులు


కేసీఆర్ చేతుల మీదుగా బీఫాంలు అందుకుంటున్న సుధీర్ కుమార్, కవిత

హన్మకొండ/మహబూబాబాద్: బీఆర్ఎస్ వరంగల్, మహబూబాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ అభ్యర్థులు మారపల్లి సుధీర్‌కుమార్, మాలోత్ కవిత బీఫాంలు అందుకున్నారు. గురువారం హైదరాబాద్ తెలంగాణ భవన్‌లో పార్లమెంట్ అభ్యర్థులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, మాజీ ఎమ్మెల్యేలు, పార్టీ ముఖ్య నాయకుల సమావేశం జరిగింది. సమావేశం అనంతరం పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్.. ఎంపీ అభ్యర్థులకు బీ ఫాంలు అందజేశారు. కార్యక్రమంలో శాసన మండలి డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాష్, ఎమ్మెల్సీలు బస్వరాజు సారయ్య, సిరికొండ మధుసూదనాచారి, సత్యవతి రాథోడ్, తక్కెళ్లపల్లి రవీందర్‌రావు, జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి, వరంగల్ జెడ్పీ చైర్‌పర్సన్ గండ్ర జ్యోతి, మాజీ ఎమ్మెల్యేలు శంకర్‌నాయక్, రెడ్యా నాయక్ , హరిప్రియ, తదితరులు పాల్గొన్నారు.

ఓటుహక్కుపై ముగ్గులతో చైతన్యం


ముగ్గులను పరిశీలిస్తున్న శ్రద్ధాశుక్లా

ఓటు హక్కు ప్రాధాన్యంపై మహిళలకు అవగాహన కలిగించేలా గురువారం జిల్లా కలెక్టరేట్ ఎదుట వివిధ శాఖల మహిళా ఉద్యోగులకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. ట్రైనీ కలెక్టర్ శ్రద్దా శుక్లా ముగ్గులను పరిశీలించారు. విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు.

- హన్మకొండ అర్బన్

కోడిపిల్లను గాబులో వేశాం.. ఇక తిరుగేలేదు

- రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు


మాట్లాడుతున్న మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

బయ్యారం: ఉమ్మడి ఖమ్మం జిల్లా పరిధిలో కాంగ్రెస్ పార్టీ కాని కోడిపిల్ల(భద్రాచలం ఎమ్మెల్యే) ను గాబులో వేశాం.. ఇక కాంగ్రెస్‌కు తిరుగేలేదని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. మహబూబాబాద్‌లో శుక్రవారం నిర్వహించే సీఎం బహిరంగసభకు జనసమీకరణ నిమిత్తం గురువారం బయ్యారంలోని కోదండ రామచంద్రస్వామి ఫంక్షన్‌హాల్‌లో గార్ల-బయ్యారం మండలాల్లోని పార్టీ ముఖ్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ఉమ్మడి జిల్లా పరిధిలో ఉన్న పది ఎమ్మెల్యే స్థానాల్లో గత ఎన్నికల్లో తొమ్మిది స్థానాల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు గెలవగా భద్రాచలంలో బీఆర్ఎస్ అభ్యర్థి గెలిచారన్నారు. ఇప్పుడు ఆ అభ్యర్థి (కోడిపిల్లగా మంత్రి సంబోధించారు) కాంగ్రెస్‌లో చేరడంతో పదికి పది కాంగ్రెస్ పార్టీ పక్షాన ఉన్నాయని.. ఇక మనం ఏ అభివృద్ధి పని గురించి అడిగినా సీఎం రేవంత్ ప్రాధాన్యం ఇస్తారన్నారు. రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వంపై కొందరు విమర్శలు చేయడం హాస్యాస్పదంగా ఉందని, లోక్‌సభ ఎన్నికల్లో ప్రజలు ఇచ్చే తీర్పుతో మిగతా పార్టీల దుకాణాలు ఖాళీ అవుతాయన్నారు. సీఎం బహిరంగ సభకు పార్లమెంట్‌స్థానం పరిధిలోని ఏడు నియోజకవర్గాల నుంచి లక్ష మందిని తరలించనున్నామన్నా రు. ప్రజలు కాంగ్రెస్ అభ్యర్థి బలరాంనాయక్‌ను గె లిపించే బాధ్యత తీసుకుంటే అభివృద్ధి చేసే బాధ్య త తాము తీసుకుంటామన్నారు. సమావేశంలో ఎమ్మెల్యే కోరం కనకయ్య, ఎంపీ అభ్యర్థి బలరాంనాయక్, నియోజకవర్గ కోఆర్డినేటర్ వెన్నం శ్రీకాంత్‌రెడ్డి, గార్ల జెడ్పీటీసీ ఝాన్సీ, ఎంపీపీ నాగరాజు, బయ్యారం, గార్ల మండలాల పార్టీ అధ్యక్షులు ముసలయ్య, రామారావు, సొసైటీ చైర్మన్లు మధుకర్‌రెడ్డి, దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

కావ్యకు నాకంటే ఎక్కువ మెజార్టీ తీసుకువస్తా

- మంత్రి కొండా సురేఖ


మాట్లాడుతున్న మంత్రి సురేఖ

వరంగల్: వరంగల్ పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి కడియం కావ్యను గెలిపించడమే కాకుండా అసెంబ్లీ ఎన్నికల్లో తనకు వచ్చిన మెజార్టీ కంటే ఎక్కువ సాధిస్తామని మంత్రి కొండా సురేఖ అన్నారు. గురువారం రాత్రి పోచమ్మమైదాన్‌లోని అబ్బాస్ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన వరంగల్ తూర్పు నియోజకవర్గ స్థాయి కార్యకర్తల సమావేశంలో ఎమ్మెల్యే కడియం శ్రీహరి, మాజీ ఎమ్మెల్సీ కొండా మురళీధర్‌రావు, ఎంపీ అభ్యర్థి కడియం కావ్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి సురేఖ మాట్లాడుతూ కొండా దంపతులు సన్మానాలకు దూరమన్నారు. సన్మానాలకు అయ్యే ఖర్చుతో అనాథలకు భోజనం అందించాలన్నారు. రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం వచ్చిందని, ఆరు గ్యారంటీల్లోని ఐదింటిని 100 రోజుల్లో అమలు చేశామన్నారు. అంబేడ్కర్‌పై మాట్లాడే నైతిక విలువ కేసీఆర్‌కు లేదని, రాజకీయాల్లోకి అసభ్య పదజాలం తీసుకువచ్చింది కేటీఆర్, కేసీఆర్‌లే అని గుర్తించాలన్నారు. స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి మాట్లాడుతూ కాంగ్రెస్ అధిష్టానం టికెట్ ప్రకటించిన క్షణం.. కొండా దంపతులు తన బిడ్డకు నిండు ఆశీర్వాదం అందించారన్నారు. ఎంపీ అభ్యర్థి కావ్య మాట్లాడుతూ రాజకీయాల్లో ఎలా ముందుకు పోవాలో కొండా సురేఖ చెబుతున్నారని, ఈ సమావేశం చూస్తే తన గెలుపు ఖాయం అనిపిస్తోందన్నారు. మాజీ ఎమ్మెల్సీ కొండా మురళీధర్‌రావు మాట్లాడుతూ కొండా మురళీధర్ మాట ఇస్తే.. తప్పడన్నారు. కడియం కావ్యకు 50వేల మెజార్టీ ఇస్తామన్నారు. ఈసందర్భంగా కాంగ్రెస్‌లో చేరిన పలువురికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్పొరేటర్లు, నాయకులు నవీన్‌రాజు, ప్రకాశ్, ప్రభాకర్, శ్రీనివాస్, శ్రీనివాస్, రాజేష్, రవీందర్ పాల్గొన్నారు.

ఎన్నికల ఖర్చులు లెక్కించండి

- ఎన్నికల సంఘం వ్యయ పరిశీలకులు
- జిల్లా అధికారులతో సమీక్ష


సమీక్షిస్తున్న ఎన్నికల కమిషన్ వ్యయ పరిశీలకులు, చిత్రంలో కలెక్టర్ ప్రావీణ్య

కాళోజీ సెంటర్: పార్లమెంట్ అభ్యర్థుల ఖర్చుల వివరాల్ని ఎన్నికల ప్రక్రియ ముగిసే వరకు నమోదు చేయాలని భారత ఎన్నికల కమిషన్ వ్యయ పరిశీలకులు ఏ.ధిలీబన్, ధీరజ్ సింగా అన్నారు. రిటర్నింగ్ అధికారి, గురువారం వరంగల్ కలెక్టరేట్‌లో కలెక్టర్ ప్రావీణ్య, అదనపు కలెక్టర్ జి.సంధ్యారాణి, డీఆర్డీఓ శ్రీనివాస్‌తో కలిసి వరంగల్ పార్లమెంట్ నియోజకవర్గంలోని 7 అసెంబ్లీ సెగ్మెంట్ల ఎన్నికల వ్యయ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈసందర్భంగా ఎన్నికల్లో వ్యయ లెక్కింపునకు ఏర్పాట్లు చేసిన కమిటీలు, బృందాలు ఇప్పటి వరకు స్వాధీనం చేసుకున్న అప్పగించిన నగదు, మద్యం, తదితర వివరాల్ని ఎస్ఎస్‌టీఎఫ్ఎస్‌టీ బృందాలు వ్యయ పరిశీలకులకు వివరించారు. ఈ సందర్భంగా ధిలీబన్ ధీరజ్ సింగా మాట్లాడుతూ.. రాజకీయ పార్టీలు, అభ్యర్థుల ఆమోద, ఆమోద యోగ్యం కాని ప్రతీ ఖర్చును సహాయ వ్యయ పరిశీలకులు, అకౌంటింగ్ టీమ్, వీఎస్‌టీవీవీ టీలు నమోదు చేయాలన్నారు. రాజకీయ పార్టీలు, అభ్యర్థులు నిర్వహించే ర్యాలీలు, బహిరంగ సభలు, సమావేశాలు, రోడ్ షోల న్నింటినీ వీడియో సర్వేలెన్స్ టీమ్ సభ్యులు రికార్డ్ చేయాలన్నారు. అభ్యర్థుల వ్యయ వ్యయ రిజిస్టర్లు సక్రమంగా నిర్వహించాలని సూచించారు. అనుమతి తీసుకున్న వాహనాల కంటే ఎక్కువ ఉపయోగిస్తే అనుమతి రద్దు చేయాలన్నారు. ఓటర్లను ప్రలోభ పెట్టేలా ఉచిత కానుకల్ని పంపిణీ చేయకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో జిల్లా నోడల్ అధికారులు, రామిరెడ్డి, సంజీవ రెడ్డి, పుష్పలత, అయుబ్ అలీ, జిల్లా ఎక్సైజ్ అధికారి చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

తలంబ్రాల బుకింగ్ గడువు పొడిగింపు

హన్మకొండ: భద్రాద్రి సీతారాముల కల్యాణ తలంబ్రాలు ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో బుక్ చేసుకునేందుకు ఈనెల 25 వరకు గడువు పెంచినట్లు ఆర్టీసీ కార్గో వరంగల్ రీజియన్ ఎగ్జిక్యూటివ్ శ్రావణ్ కుమార్ తెలిపారు. బుక్ చేసుకున్న భక్తులకు నేరుగా తలంబ్రాలు అందించనున్నట్లు ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తలంబ్రాల కోసం డిపోల వారీగా ఫోన్ నంబర్ ద్వారా సంప్రదించవచ్చని సూచించారు. వరంగల్-1 డిపో 91542 98759, హనుమకొండ 91542 98761, జనగామ డిపో 91542 98762, పరకాల, భూపాలపల్లి డిపో 91542 98764, నర్సంపేట 91542 98763, తొర్రూరు 91542 98766, మహబూబాబాద్ 91542 98768, వరంగల్ రీజియన్ 93913 20465 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

గూడ్స్ షెడ్డు సమీపంలో అగ్నిప్రమాదం

కాశిబుగ్గ : వరంగల్ రైల్వే గూడ్స్ షెడ్డు సమీపంలో గురువారం అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. ఈఘటనలో ఎలాంటి నష్టం జరగలేదు. అగ్నిమాపక అధికారుల కథనం ప్రకారం.. వరంగల్ తాత్కాలిక బస్టాండ్ వెనుక, వరంగల్ రైల్వే గూడ్స్ షెడ్డు సమీపంలోని టేకు చెట్లలో అగ్ని ప్రమాదం జరిగింది. దీనిపై సమాచారం అందడంతో సిబ్బంది అక్కడికి చేరుకుని మంటలు ఆర్పివేశారు. ఎవరో సిగరెట్ తాగి పడేయగా ఎండిన చెట్ల ఆకులకు అంటుకుని ఈ ఘటన జరిగిందని తెలిపారు. వేసవిలో అగ్ని ప్రమాదాలు ఎక్కువగా జరిగే అవకాశం ఉన్న నేపథ్యంలో బీడీ, సిగరెట్ తాగి ఎక్కడ పడితే వేయొద్దన్నారు. కాగా, అగ్నిప్రమాదం జరగడంతో ప్రయాణికులు కొంత ఆందోళనకు గురయ్యారు.

ఇంటర్ విద్యార్థి ఆత్మహత్య


వంశీ(ఫైల్)

పాలకుర్తి టౌన్: ఇంటర్మీడియట్ పరీక్షలో మరోసారి ఫెయిల్ అవుతానేమోనని భయంతో ఓ విద్యార్థి మనస్థాపానికి గురై ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన జనగామ జిల్లా పాలకుర్తి మండల కేంద్రంలో జరిగింది. ఎస్సై సాయి ప్రసన్నకుమార్ కథనం ప్రకారం పాలకుర్తికి చెందిన ఈరంటి వంశీ(19) గత సంవత్సరం సంవత్సరం ఇంటర్మీయట్ పరీక్షల్లో ఫెయిల్ అయ్యాడు. ఇంటి వద్ద ఉంటూనే ఇటీవల సప్లిమెంటరీ పరీక్ష రాశాడు. అయితే ఇందులో కూడా ఫెయిల్ అవుతానేమోననే భయంతో మనస్తాపానికి గురై ఇంట్లో ఫ్యాన్‌కు ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటనపై తండ్రి సత్యనారాయణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. కాగా, బుధవారం రాత్రి వరకు స్నేహితులతో కలిసి ఉండి ఇంటికి వచ్చిన తర్వాత భోజనం చేసి అర్ధరాత్రి ఉరి వేసుకొని ఆత్మహ్యకు పాల్పడినట్లు సమాచారం.

నేడు మావోయిస్టు దంపతుల అంత్యక్రియలు

- శుక్రవారం స్వగ్రామానికి చేరుకోనున్న సుధాకర్, రజిత మృతదేహాలు
- చల్లగరిగెలో విషాదఛాయలు

చిట్యాల: ఛత్తీస్‌గఢ్‌లోని కాంకేరు జిల్లా మాడ్ ప్రాంతంలో నాలుగు రోజుల క్రితం జరిగిన ఎన్‌కౌంటర్‌లో మృతి చెందిన మావోయిస్టు దంపతులు సిరిపెల్లి సుధాకర్ అలియాస్ శంకర్‌రావు, అతడి భార్య దాశశ్వర్ సుమన అలియాస్ రజిత మృతదేహాలు శుక్రవారం స్వగ్రామం చల్లగరిగెకు చేరుకోనున్నాయి. ఇదే రోజు కుటుంబీకులు.. సుధాకర్, రజిత అంత్యక్రియలు నిర్వహించనున్నారు. కాగా, సుధాకర్ దంపతుల మృతదేహాలను తీసుకురావడానికి కుటుంబీకులతోపాటు గ్రామస్తులు బుధవారం ఛత్తీస్‌గఢ్ బయలుదేరగా గురువారం చేరుకున్నారు. మార్చురీలో ఉన్న మృతదేహాలను గుర్తించారు. శుక్రవారం ఉదయం చల్లగరిగెకు తీసుకురానున్నారు. కాగా, సుధాకర్ దంపతుల మృతితో గ్రామంలో విషాదం నెలకొంది.


మాట్లాడుతున్న వరంగల్ ఆర్‌ఎం శ్రీలత

లక్షే లక్ష్యం..

ఆర్టీసీలో మరో చాలెంజ్
- ఆదాయం పెంచుకునే దిశగా అడుగులు
- వరంగల్ రీజియన్‌లో ప్రారంభం

హన్మకొండ: టీఎస్ ఆర్టీసీ.. ఆదాయం పెంచుకునే దిశలో సరికొత్త చాలెంజ్‌లతో ముందుకెళ్తోంది. ఆర్టీసీ ఎండీగా వి.సి.సజ్జనార్ బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి సంస్థ పరిరక్షణ, ఆదాయ పెంపునకు అనేక చర్యలు తీసుకుంటున్నారు. ఈ క్రమంలో ఆర్టీసీ యాజమాన్యం ఇప్పటికే దసరా, రాఖీ, సంక్రాంతి, ఆల్ డిపోస్ ప్రాఫిట్ చాలెంజ్, 100 రోజుల చాలెంజ్, ఒక గొప్ప మార్పుకు ఇదే శ్రీకారం, విధుల్లో నైపుణ్యం ప్రదర్శించాలి వంటి కార్యక్రమాలు చేపట్టింది. తాజాగా 'లక్షే లక్ష్యం' అనే పేరుతో మరో చాలెంజ్ తీసుకువచ్చింది.

పెరిగిన వ్యయాన్ని పూడ్చుకునేందుకు..

ఇటీవల ఆర్టీసీ ఉద్యోగులకు యాజమాన్యం వేతన సవరణ చేసింది. వేతన సవరణ ద్వారా పెరిగిన వ్యయాన్ని పూడ్చుకునేందుకు సరికొత్త వ్యూహాలకు పదును పెట్టింది. ఇందులో భాగంగా ప్రతి డిపోలో ప్రతి రోజు ఆదాయం పెంచుకోవాలని చాలెంజ్ తీసుకువచ్చింది. రోజు అదనంగా రూ.లక్ష ఆదాయం తీసుకురావాలన్నదే 'లక్షే లక్ష్యం' చాలెంజ్. ఈ కార్యక్రమాన్ని గురువారం నుంచి ప్రారంభించారు. ఈ చాలెంజ్ ఏడాది పాటు కొనసాగుతుంది. వరంగల్ రీజియన్‌లో 9 డిపోలున్నాయి. ఈ లెక్కన రీజియన్‌లో ప్రతి రోజు అదనంగా రూ.9 లక్షల ఆదాయం తీసుకురావాలి. ఆదాయం పెంచుకోవాలంటే ప్రయాణికులను ఆర్టీసీ వైపునకు ఆకర్షించాలి. ప్రస్తుత ప్రయాణికుల సంఖ్యను పెంచుకుంటేనే ఈ చాలెంజ్‌లో రాణిస్తారు. అదనపు ట్రిప్పులు నడపడం, ప్రయాణికులను పిలిచి బస్సు ఎక్కించుకోవడం ద్వారా ఆదాయం పెంచుకోనున్నారు.

డిపోల ఆదాయ సామర్థ్యాన్ని బట్టి లక్ష్యం..

వరంగల్ రీజియన్‌లోని 9 డిపోలకు ఆయా డిపోల ఆదాయ సామర్థ్యాన్ని బట్టి లక్ష్యం నిర్దేశించుకున్నారు. వరంగల్ రీజియన్‌లో జీరో టికెట్‌తో కలిపితే రోజూ సగటున రూ.2.20 కోట్ల ఆదాయం వస్తోంది. జీరో టికెట్‌ను మినహాయిస్తే నగదు రూపేణ రోజూ సగటున రూ.1.20 కోట్ల ఆదాయం వస్తోంది. ఈ ఆదాయానికి అదనంగా మరో రూ.9 లక్షలు రాబట్టుకోవడమే ఈ చాలెంజ్ లక్ష్యం. ఆదాయం తక్కువగా వచ్చే డిపోల నుంచి అధిక ఆదాయం వచ్చే డిపోల వారీగా రోజుకు రూ.50 వేల నుంచి రూ.1.80 లక్షల ఆదాయం అదనంగా రాబట్టుకోవాలని నిర్దేశించుకున్నారు. రోజుకు రూ.9 లక్షల లెక్కన నెలకు రూ.2.70 కోట్లు, సంవత్సరానికి రూ.64,80 కోట్ల ఆదాయం సమకూర్చుకోవడమే లక్ష్యంగా వరంగల్ రీజియన్ యాజమాన్యం ముందుకెళ్తోంది. కాగా, వరంగల్ రీజియన్‌లో 'లక్షే లక్ష్యం' చాలెంజ్‌ను గురువారం హనుమకొండలోని వరంగల్-1 డిపోలో వరంగల్ రీజినల్ మేనేజర్ జాస్తి శ్రీలత ప్రారంభించారు. ప్రయాణికులను ఆర్టీసీ వైపు ఆకర్షించాలని, ప్రతి స్టేజీలో పిలిచి ఎక్కించుకోవాలన్నారు. కార్యక్రమంలో డీఎం వంగల మోహన్ రావు, అసిస్టెంట్ ఇంజనీర్ (మెకానికల్) శ్రీనివాసులు, అసిస్టెంట్ మేనేజర్ (ట్రాఫిక్) సంతోష్ కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.